# లవ్ ఎట్ ఫస్ట్ సైట్

—టి.వి.ప్రసాద్

“‘ఏరా గోపి వేసే ప్రతి అడుగుకీ ఓసారి వెనక్కి తిరిగి చూస్తావెందుకురా?’’ నా వైపు సీరియస్‌గా చూస్తూ అడిగాడు రమణగాడు.

రమణగాడు నాకు డిగ్రీలో మంచి ఫ్రెండ్. డిగ్రీ పూర్తయిన తరువాత మళ్ళీ మేము కలుసుకోవటం కుదరలేదు. ఇద్దరం జాబుల్లో సెటిలయిన సంవత్సరం తరువాత ఇప్పుడే కలవటం. ప్రతి విషయాన్ని వాడు నిశితంగా గమనిస్తాడు... నేను వేసే ప్రతి అడుగునీ వాడు జాగ్రత్తగా గమనిస్తున్నాడని గ్రహించి సమాధానంగా వాడి వైపు చూసి వేదాంతిలా ఓ చిరునవ్వు నవ్వాను.

ఈ మధ్య ఇలా నవ్వటం బాగా ప్రాక్టీస్ చేశానులెండి. ముందు నడుస్తున్నవాడు తక్కున ఆగిపోయాడు.



"ఏరా అలా నవ్వుతున్నావ్... ఏ మాట అడిగినా ఇలాగే సమాధానం చెబుతున్నావ్, ఏమ యింది?" కళ్ళనీళ్ళు పెట్టుకున్నంత పని చేస్తూ చేతుల్ని పట్టుకుని కుదిపేస్తూ ప్రశ్నించాడు వాడు.

సమాధానం ఏం చెప్పాలా అని ఆలోచిస్తూ అలవాటుగా మరోసారి నవ్వాను.

"ఒరే... గోపీ ఏమయిందిరా... ఈ రెండు సంవత్సరాలలో నీ జీవితం పేమతుఫానుకి గుర యిందా... ఎప్పుడు పెళపెళ లాడే వంద నోట్లా వుండేవాడివి. ప్రతి మాటకు ఆ వెధవ నవ్వు నవ్వుతావేంట్రా" బావురుమన్నాడు వాడు.

నాకు వాణ్ణి చూస్తే జాలేసింది. ఒకే సినిమా టిక్కెట్ మీద ఇంట్రవెల్ వరకూ వాడు, ఇంట్రవెల్ నుంచి నేను సినిమా చూసిన ప్రాణమిత్రులం మేము. అటువంటి రమణగాడికి నా కథ చెప్పడం స్నేహధర్మం అనిపించింది.

"రమణా... నాకు నా కథ ఎలా మొదలు పెట్టాలో తెలియటం లేదురా."

"అందుకని అస్తమానూ ఆ వెధవ నవ్వు నవ్వుతావా" ఉక్రోషంగా అడిగాడు వాడు.

"ఆ నవ్వుకి కారణమే ఈ కథరా... విను" నేను గొంతు సవరించుకుంటూ ఫ్లాష్ బ్యాక్కి వెళ్ళిపోయాను.

"నేను జాబులో జాయిన్ అయి అప్పటికి మూణ్ణెల్లు గడిచింది. నాకు కాస్త బద్దకం అని నీకు తెలుసుగా. తరచూ ఆఫీసుకి లేటయ్యేవాడివి. బస్ ని నమ్ముకుంటే లాభం లేదని ఒక మోపెడ్ని తీసుకున్నాను. ఆ రోజు ఆఫీసుకి కాస్త ముందు వెళ్ళే వుద్దేశంతో ఓ పది నిమిషాలు ముందు బయలు దేరాను.

దారిలో నాకు కళ్ళు తిరిగాయి.

(నీరసం వల్ల కాదు)

ఒక అద్భుత సౌందర్యాన్ని చూడటం వల్ల.

పచ్చగా, నాజూగ్గా, విశాలమైన కళ్ళతో...

ఒక్క మాటలో చెప్పాలంటే బాపు బొమ్మలా వయ్యారంగా మేడ మీద నిలబడి వుందో అమ్మాయి. 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' అంటే అదే అనుకుంటాను. నా గుండె చప్పుడు నాకే స్పష్టంగా వినిపిస్తుంది. ఆమెను చూసింది ఒక్క క్షణమే అయినా ఊపిరి తీసుకోవటం మరిచాను. అలా జరగటం ఒకేసారి కాదు, ఊపిరి ఆగిపోవటం అనేది ఒక దినచర్యగా మారిపోయింది. ఆఫీస్కి వెళ్ళే టప్పుడు, తిరిగి వచ్చేటప్పుడు అదే చోట అలాగే నిల్చునేది. నన్ను చూడగానే సిగ్గుతో తలవంచు కొనేది. అలా ప్రారంభమయింది నా ప్రేమ. నాలుగు నెలలు గిర్రున తిరిగాయి. నేను తరచు అన్యమనస్కంగా వుండటం, నాలో నేను నవ్వు కోవటం చూసి మిత్ర బృందం ఆట పట్టించటం మొదలు పెట్టింది. వాళ్ళకీ విషయం చెప్పక తప్పింధి కాదు."

"ప్రేమ విషయంలో కాలయాపన మంచిది కాదు గురూ. అనుభవం మీద చెబుతున్నాను" చెప్పిందంతా విని హెచ్చరించాడో మిత్రుడు.

"మరేం చేయను... ఆ అమ్మాయి అసలు బయట ఎక్కడా కనిపించదు. అయినా ఒకర్నొకరు అర్థం చేసుకోవటానికి కనీసం ఓ ఆరు నెలలన్నా టైముండాలోయ్" అని సర్దిచెప్పానేగాని ఆమెను రోజూ మేడ మీద నుంచి చూడటం తప్ప డిటేల్స్ తెల్సుకోలేకపోయాను.

ఈ మధ్యలో నాలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయ్. మోపెడ్ స్థానంలో మోటర్ బైక్, ఆఫీసుకి టంచనుగా వెళ్ళటం, తిరిగి రావటం. ఆమె వల్లే నాలో క్రమశిక్షణ మొదలయింది.

ఒక విధంగా ఆమెతో పెళ్ళి అనేది జరగకుండానే నన్ను శాసిస్తుందని నవ్వుకున్నాను.

ఇంట్లో నా పెళ్ళి గురించి పోరు ఎక్కువయింది.

వున్నట్లుండి ఒక రోజు నా మేనమామ తన కూతుర్ని తీసుకుని ఓ రోజు వూడిపడ్డాడు.

"ఏరా గోపీ, నీ నిర్ణయం చెబుతావా, లేక రాజీకి వేరే ఏదయినా సంబంధం ఖాయం చేయమంటావా?" స్ట్రెయిట్గా విషయంలోకి వచ్చేశాడు మావయ్య.

మేడ మీద అమ్మాయిని తప్ప భూ ప్రపంచంలో మరో అమ్మాయిని చేసుకోకూడదని అప్పటికే నిర్ణయించుకోవటం వల్ల రాజీ నాకు ఇష్టం లేదని చెప్పాను. మరో పది రోజులకే దానికి వేరే వాళ్ళతో పెళ్ళి జరిగిపోయింది.

నా మనసు మేడ మీద అమ్మాయితో వివాహానికి తొందరపడసాగింది. అసలామెను బయట ఎలా కలుసుకోవాలో అర్థం కాలేదు.

వున్నట్లుండి ఓ రోజు నన్ను మా బాస్ పిలిచి కంగ్రాట్స్ చెబుతూ చేతిలో ఓ కవర్ పెట్టాడు. అది నా ప్రమోషన్కి సంబంధించిన కాయితం. కాని నేను ప్రమోషన్ని తిరస్కరించాను. కారణం — ప్రమోషన్ మీద నేను వేరే వూరు ట్రాన్స్ఫరయి వెళ్ళిపోవటం ఇష్టంలేక ప్రమోషన్ వద్దన్నాను.

ఇక లాభం లేదని ఆమెను విషయం అడిగేయాలని నిశ్చయించుకున్నాను. ఆ ప్రయత్నంలో ఆమె యింటి ముందు కొంత మంది డిటెక్టివ్స్ని (మిత్రుల్నే) నియమించాను. నా కృషి ఫలించింది. ఆ రోజు ఆఫీసుకు ఫ్రెండ్స్ దగ్గర నుంచి ఫోన్ వచ్చింది.

"ఒరో గోపి ఆ అమ్మాయి పేరు మాధురీరా. ప్రస్తుతం సూపర్ బజార్లో వుంది. అర్జంటుగా ఇక్కడకొచ్చేయ్" అని చెప్పి ఫోన్ పెట్టేశారు వాళ్ళు.

అంతా అయోమయం, హడావిడి...అర్జంటుగా పని వుందని చెప్పి లీవ్ కొట్టి బండేసుకుని బయలు దేరాను.

వాళ్ళు చెప్పింది నిజమే. మాధురి సూపర్ బజార్లో నిలబడి వుంది.

"హలో మాధురీ, హౌ ఆర్యు" చాలా కాలం నుంచి పరిచయం వున్నవాడిలా విష్ చేశాను.

"ఫైన్..." చిరునవ్వుతో చెప్పిందామె.

"ఐ యామ్ గోపీ" ఆమె అడక్కుండానే పేరు చెప్పాను.

"మీరు రోజూ మా యింటి మీదగానే వెళుతుంటారు కదూ" కళ్ళను చక్రాల్లా తిప్పుతూ అడిగిందామె...

అలా మాటల్లోపడ్డాం. నేను సూపర్ బజార్ పై వున్న ఫాస్ట్ ఫుడ్ రెస్టారెంట్కి ఆమెను ఆహ్వానించాను. నా మనసులో మాట చెప్పటానికి అదే మంచి అవకాశమని నమ్మి.

ఇద్దరం రెస్టారెంట్కి నడిచాం...

తరువాత ఎంతో కాలం నుంచి పరిచయం వున్నవాళ్ళలా మాట్లాడుకున్నాం. చివరిగా నా అభిప్రాయం చెప్పాను. "ఇదిరా సంగతి" చెప్పటం ముగించాడు గోపి.

"తరువాత ఏమయింది?" సస్పెన్స్ భరించలేక అడిగాడు రమణ.

"మరో నెలకే ఎవరి అభ్యంతరాలు లేకుండా, మాధురి వివాహం జరిగిపోయింది."

"మరి ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకుని ఎందుకురా ఇలా తయారయ్యావ్?" వాపోయాడు రమణ.

"క్యాచ్ మై పోయింట్... నీకు వివరాలు చెప్పలేదు కదూ... నా ప్రపోజల్ విని ఆమె ఆనందపడుతుందనుకున్నాను. కాని ఆమె షాకయింది. 'నిజంగా నా కోసం మీ మరదల్నీ, ప్రమోషన్స్ని వదులుకున్నారా?' అని ప్రశ్నించింది.

"ఏం అలా అడుగుతున్నారని" అడిగాను నేను.

"ఏమంది...?" ఆత్రుతగా అడిగాడు రమణ.

"మీరు చాలా పొరపాటు చేశారు గోపీగారు. రోజూ మీరు ఆఫీస్కి వచ్చే సమయం, మా రవీంద్ర ఐ మీన్ నాకు కాబోయే భర్త ఆఫీసుకు వెళ్ళే సమయం ఒక్కటే. అతని కోసమే నేను బయట నిల్చుంటాను' అనటంతో నా బుర్ర తిరిగిపోయింది. అప్పట్నుంచీ ఇలా పెద్దలు చెప్పినట్లు ముందూ వెనక చూసుకుని మరీ అడుగేస్తున్నాను."

గోపీ కళ్ళలో నీళ్ళు చూసి నోట మాట రాలేదు రమణకి. ●